సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం, 25, ఏప్రిల్, 2023



వలసపల్లిలో జ్వరాలు 8లో

సీలేరు పీహెచ్‌సీ పరిధి వలసపల్లి గ్రామంలో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు మంచం పట్టారు.



మన్యంలో భారీ వర్షం 8లో

డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.



భక్తిశ్రద్ధలతో ఘటాల ఊరేగింపు

కొయ్యూరు: శరభన్నపాలెం నుంచి నిర్వహించిన ఎర్రగొండమ్మతల్లి ఘటాల ఊరేగింపులో ఎంపీ మాధవి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఐటీడీఏ స్పందనకు 41 అర్జీలు



ఐటీడీఏ గ్రీవెన్స్‌లో పీవోకు సమస్యలు వివరిస్తున్న ఉద్యోగులు

రంపచోడవరం : స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 41 అర్జీలు స్వీకరించినట్టు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, వ్యక్తిగత సమస్యలకు సంబంధించి వినతులు అందాయని ఆయన వివరించారు. రంపచోడవరం మండలం మర్రివాడ గ్రామం నుంచి పెద్ద కొండ వరకు మూడున్నర కిలోమీటర్ల సీసీరోడ్డు నిర్మించాలని, కొండ పోడు పట్టాలు ఇప్పించాలని, ఏజెన్సీలో ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వర్కర్లను నియమించాలని వినతులు అందాయన్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని నాన్ టీచింగ్ ఉద్యోగులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి స్ట్రక్చర్ సర్వే

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు పరిధిలో ప్రయారిటీ హాబిటేషన్లుగా గుర్తించిన గ్రామాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి స్ట్రక్చర్ (నివాస గృహాలు) సర్వే చేపట్టనున్నట్టు తహసీల్దార్ ఎన్. శ్రీధర్ తెలిపారు. రామవరప్పాడు, అడివివెంకన్నగుడెం, ప్రత్తిపాక, చింతరేగుపల్లి, గుండుగుడెం, రాజుపేటకాలని, ధర్మతాళ్లగూడెం, వడ్డిగూడెం, వీఆర్‌పురం గ్రామాల్లో బృందాలు సర్వే నిర్వహిస్తాయని ఆయన పేర్కొన్నారు. సర్వే సమయంలో సర్వే బృందాలకు నిర్వాసితులు అందుబాటులో సహకరించాలని ఆయన సూచించారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఒక పక్క వారపు సంతకు, మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన సుమారు 145 మందికి ప్యాకెట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ ఎంఎల్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస-కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో సోమవారం రాత్రి బయల్దేరిన విశాఖ-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈనెల 25వ తేదీన బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. విశాఖలో 25వ తేదీన బయల్దేరే విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈనెల 26వ తేదీన బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

రాజవొమ్మంగిలో ఆరుగురికి కోవిడ్ పాజిటివ్

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌సీల్లో సోమవారం ఆరు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు సంబంధిత వైద్యాధికారులు తెలిపారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీలో 13 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి వైరస్ సోకిందని డాక్టర్ లిఖిత తెలిపారు. లాగరాయి పీహెచ్‌సీలో ఐదుగురిని పరీక్షించగా ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి రవీంద్ర ఏచూరి తెలిపారు. పాజిటివ్ వచ్చిన వారిలో స్థానిక ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న నలుగురు గిరిజన విద్యార్థులు ఉన్నారు. వీరు ఐసోలేషన్‌లో ఉంటూ చికిత్స పొందుతున్నారు.

డుడుమ నుంచి బలిమెలకు నీటి విడుదల

ముంచంగిపుట్టు: ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన డుడుమ జలాశయం నీటిని దిగువ నున్న బలిమెల జలాశయానికి విడుదల చేశారు. డుడుమ జలాశయానికి చెందిన 5,6 గేట్లు సోమవారం రాత్రి 7.13 గంటలకు ఎత్తి నదిలోకి 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం మన్యంలో కురుస్తున్న వర్షాలకు డుడుమ జలాశయ నీటి స్థాయి క్రమేపీ పెరుగుతోంది. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా నీటిని విడుదల చేశామని ప్రాజెక్ట్ అధికారవర్గాలు తెలిపాయి.

మన్యం బెల్లం.. భలే రుచి

- సేంద్రియ విధానంలో తయారీతో ఆరోగ్యం
- ఎకరాకు రూ.50 వేలు
- గిరి రైతుకు మంచి ఆదాయం



బెల్లం తయారీలో గిరి రైతులు



గెడ్డంపుట్టు ప్రాంతంలో చెరకు సాగు



బెల్లం దిమ్మలు

సాక్షి,పాడేరు: జిల్లాలో చెరకు సాగు గిరి రైతులకు ఆదాయ వనరుగా మారింది. బెల్లం తయారుచేసి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందుతున్నారు. చెరకు పంటకు సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల బెల్లం రుచికరంగానే కాకుండా ఆరోగ్యపరంగా బాగుంటుంది.

అవగాహనతో మెరుగు

గతంలో బెల్లం కాస్త నలుపు రంగులో ఉండేది.వ్యవసాయాధికారులు బెల్లం తయారీలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మార్కెటింగ్‌కు అనువుగా ఉండేలా తయారు చేయడంపై కల్పించిన అవగాహన మంచి ఫలితాలు ఇచ్చాయి.

బెల్లం నాణ్యతతోపాటు రంగు ఆకర్షణీయంగా మారింది. దీంతో స్థానికంగాను డిమాండ్ ఏర్పడింది. కొంతమంది అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. పాడేరులో ఐటీడీఏ ఏర్పాటుచేసిన వన్‌ధన్ మార్టులో కూడా గిరిజన రైతులు తయారు చేసిన బెల్లం అందుబాటులో ఉంది.

138 హెక్టార్లలో సాగు

జిల్లాలో 138 హెక్టార్ల విస్తీర్ణంలో చెరకు సాగవుతోంది. హుకుంపేట మండలంలోని మత్స్యపురం, సూకురు, బాకూరు, వోల్డా పంచాయతీల పరిధిలో 47 హెక్టార్లు, పాడేరు మండలంలోని తుంపాడ, కుజ్జెలి పంచాయతీల పరిధిలో 41హెక్టార్లు, గూడెం కొత్తవీధి మండలంలో 10 హెక్టార్లు, అడ్డతీగలలో 34హెక్టార్లు, కొయ్యూరులో రెండు, రాజవొమ్మంగిలో రెండు, డుంబ్రిగుడ మండలంలో హెక్టారులో చెరకును పండిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున పైరు ఎదుగుదల ఆశాజనకంగా ఉంది.

స్థానికంగానే తయారీ

గిరిజన రైతులు స్థానికంగానే బెల్లాన్ని తయారుచేస్తున్నారు. ఇందుకు అవసరమైన పెనాలను ఏర్పాటుచేసుకున్నారు. ఎకరాకు 20 నుంచి 25 టన్నుల వరకు చెరకు దిగుబడి వస్తుంది. దీని ద్వారా 100 కిలోల బెల్లం తయారవుతుంది. స్థానికంగా గిరి రైతులు 15 కిలోలు, 10 కిలోలు, కిలో సైజులో దిమ్మలను తయారు చేస్తున్నారు. పెట్టుబడి పోను ఎకరాకు రూ.50 వేల వరకు ఆదాయం వస్తోందని గిరి రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది గిరి రైతుల తయారు చేసిన బెల్లానికి హోల్‌సేల్ మార్కెట్లో కిలోకు రూ.35 నుంచి రూ.37 ధర లభించింది.

దిగుబడి బాగుంది

ఈ ఏడాది చెరకు దిగుబడి బాగుంది.మూడు ఎకరాల విస్తీర్ణంలో ఏటా సాగు చేస్తున్నా. బెల్లం తయారు చేసి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం వస్తోంది. ఇప్పటికే మూడు వేల కిలోల బెల్లం తయారుచేసి విక్రయించా.



– ముదువ సింహాచలం, గిరి రైతు, గెడ్డంపుట్టు, పాడేరు మండలం

అవగాహన పెరిగింది

గిరిజన రైతులకు నాణ్యమైన బెల్లం తయారీపై అవగాహన పెరిగింది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయాధికారులంతా నాణ్యమైన బెల్లం తయారీపై ఏటా ఇస్తున్న శిక్షణ ఎంతో మేలు చేస్తోంది.



– ఎస్‌బీఎస్.నందు, జిల్లా వ్యవసాయాధికారి

గూడెంలో షూటింగ్ సందడి



సినిమా చిత్రీకరణకు రింతాడ వచ్చిన నటుడు సత్యం రాజేష్, డైరెక్టర్, నిర్మాత విజయప్రవీణ, యూనిట్ సభ్యులు

గూడెంకొత్తవీధి: మండలంలో సినిమా చిత్రీకరణ సందడి నెలకొంది. పరుచూరి ప్రవీణ్ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సినిమాకు సంబంధించి కీలకమైన సన్నివేశాలను రింతాడలో సోమవారం చిత్రీకరించారు. ఈచిత్రానికి విజయ ప్రవీణ డైరెక్టర్, నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య చిత్రాలను తన బ్యానర్‌పై నిర్మించానని ఇది తనకు మూడో చిత్రమని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాలో తొలిసారిగా మనోజ్ కథానాయకుడిగా, కథానాయికగా హైదరాబాద్‌కు చెందిన మౌనిక సౌమ్య, ప్రధాన పాత్రలో సత్యం రాజేష్, ప్రేమ్‌సాగర్, ఫణి నటిస్తున్నారన్నారు. మణిశర్మ సంగీత దర్శకత్వం వహిస్తున్నట్టు తెలిపారు. సినిమా చిత్రీకరణ గూడెం ప్రాంతంలో ఎనిమిది రోజులపాటు చేపట్టనున్నట్టు యూనిట్ సభ్యులు తెలిపారు.

చిగురించిన వసంతం



లేలేత చిగుళ్లతో వృక్షం

అనంతగిరి: మన్యం అంటేనే ప్రకృతి అందాలకు నిలయం. సహజసిద్ధ అందాలు పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. వేసవిలో ఆకులు రాల్చిన చెట్లన్నీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిగురించి వివిధ రంగుల్లో కనువిందు చేస్తున్నాయి. అరకు-విశాఖ ప్రధాన రహదారిలో అనంతగిరి నుంచి శివలింగపురం వరకు చెట్లు వివిధ రంగుల్లో లేలేత చిగుళ్లతో ఆకట్టుకుంటున్నాయి.



అనంతగిరి సమీపంలోని రంగురంగుల చిగుళ్లతో కనువిందు చేస్తున్న మామిడి చెట్టు

పంచాయతీల్లో 'ఉత్తమ' స్థానం



ఉమ్మడి విశాఖ జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తికి అవార్డు అందజేస్తున్న విశాఖ జేసీ విశ్వనాథన్

ఉత్తమ పంచాయతీల జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు విశిష్ట స్థానం దక్కింది. వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి అవార్డులను దక్కించుకుని ప్రత్యేకతను చాటుకుంది. ఈ కేటగిరీలో నాలుగు అవార్డులు దక్కాయి.ఉమ్మడి విశాఖ జిల్లాలో 27 పంచాయతీలకు అవార్డులు అందజేయగా వీటిలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదు పంచాయతీలు ఉన్నాయి. 8లో



ఉత్తమ పంచాయతీ అవార్డును స్వీకరిస్తున్న జి.మాడుగుల సర్పంచ్ కిముదు రాంబాబు

మొరాయించిన జోలాపుట్టు బస్సు

- మంచంగిపుట్టులో నిలిపివేసిన ఆర్టీసీ డ్రైవర్
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



ముంచంగిపుట్టులో నిలిచిపోయిన జోలాపుట్టు నైట్‌హాల్ట్ ఆర్టీసీ బస్సు

ముంచంగిపుట్టు: మధురవాడ (విశాఖ)– జోలాపుట్టు నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి మొరాయించి మండల కేంద్రంలో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు అవస్థలకు గురయ్యారు. విశాఖలోని మధురవాడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మధ్యాహ్నం 2.30 గంటలకు బయలు దేరి రాత్రి 9.30 గంటలకు జోలాపుట్టు చేరుకుంటుంది. ఈ నైట్ హాల్ట్ బస్సుపై ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల ప్రజలు ఆధారపడి ప్రయాణాలు చేస్తుంటారు. దీనిలో భాగంగా బయలుదేరిన బస్సు సాంకేతిక సమస్య తలెత్తడంతో డ్రైవర్ ముంచంగిపుట్టులో నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. కండీషన్‌లో లేని బస్సును నడపడం వల్ల ఈ సమస్య తరచూ తలెత్తుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల వ్యవధిలో నాలుగుసార్లు బస్సు మొరాయించి ఆగిపోయిందని వారు వివరించారు. సోమవారం ఉదయం మధురవాడ నుంచి మెకానిక్ వచ్చి మరమ్మతులు చేపట్టడంతో బస్సు బయలుదేరింది.

ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

- ఉపాధి పనులు సక్రమంగా జరగని మండలాల గుర్తింపు
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- మండల అధికారులతో వీడియో సమావేశం



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఉపాధి పనులు సక్రమంగా జరగని మండలాల ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి 22 మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు సక్రమంగా జరగని పాడేరు, రంపచోడవరం, వీఆర్‌పురం, మారేడుమిల్లి, కూనవరం, వై.రామవరం, గంగవరం, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, జి.మాడుగుల, దేవిపట్నం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. సక్రమంగా విధులు నిర్వహించని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల ఎస్ఆర్‌లు కలెక్టరేట్‌కు పంపించాలని ఆయన ఎంపీడీవోలను ఆదేశించారు.

డి.ఫారం పట్టాల పంపిణీకి చర్యలు

జిల్లాలో గిరిజన రైతులకు డి.ఫారం పట్టాలు పంపిణీకి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. భూముల రీసర్వే, పీవీటీజీ ఓటర్ల నమోదు, గిరిజన సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. భూముల రీ సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వెక్టరైజేషన్ 250 గ్రామాల్లో చేయాల్సి ఉందన్నారు. అడ్డతీగల, రంపచోడవరం, మారేడుమిల్లి, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకులోయ మండలాల్లో వెక్టరైజేషన్ పనుల వేగం పెంచాలని సూచించారు. పీవీటీజీ ఓటర్ల నమోదు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఫారం 6, ఫారం7 సేకరణ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. మే 15 లోగా బీఎల్వోలతో సమావేశాలు నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. బీఎస్ఎన్ఎల్, జియో సెల్ టవర్ల నిర్మాణాలకు అవసరమైన భూములను త్వరితగిన సేకరించాలని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు

గంజాయి సాగు నిర్మూలనలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గిరిజన రైతులు మంచి దిగుబడులు సాధించి విధంగా లాభదాయకమైన పంటలు సాగు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామసచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, రంపచోడవరం పీవో సూరజ్ గనోరే, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకుడు వై.మోహన్‌రావు, డ్వామా పీడీ రమేష్ రామన్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న నాయకత్వంతో ప్రజలకు భరోసా

రాష్ట్రంలో జగనన్న నాయకత్వానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు ఉందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మెగా పీపుల్స్ సర్వే విజయవంతంతోపాటు కోటి మిస్డ్ కాల్స్ పూర్తయిన సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా జగనన్న వెంటే ఉన్నారని పేర్కొన్నారు.

- అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు
- 2024లో వైఎస్సార్‌సీపీదే విజయం
- మిస్డ్ కాల్స్ సర్వేయే సాక్ష్యం
- ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, ధనలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



ప్రజలకు పోస్టర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

సాక్షి,పాడేరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయమని పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. జగనన్నే భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందన్నారు. పాడేరు నియోజకవర్గంలోని 97 సచివాలయాల పరిధిలో నిర్వహించిన గడప గడపకు కార్యక్రమం విజయవంతమైందన్నారు. మిస్డ్ కాల్స్ ద్వారా ప్రభుత్వ పాలనకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. గృహసారథులు,సచివాలయ కన్వీనర్లు కోటి కుటుంబాలను కలవడం చరిత్రాత్మకమన్నారు. గిరిజన ప్రాంతాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. బాక్సైట్ అనుకూల జీవో 97ను రద్దు చేశారన్నారు. రూ.500కోట్లతో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నారన్నారు. అన్ని వర్గాల గిరిజనుల సంక్షేమం లక్ష్యంగా గిరిజనుల పక్షపాతిగా పేరొందారని ఆమె పేర్కొన్నారు. మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం.సరస్వతి, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరెక్టర్ లకే రామసత్యవతి, ఎంపీటీసీలు లకే రామకృష్ణపాత్రుడు, చల్లా చిట్టమ్మ, పలాసి రాజేశ్వరి, పీఎసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి తమర్బ వెంకటేశ్వర్లు, పార్టీ క్రిస్టియన్ విభాగం నేత బాబూరావు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, మాజీ సర్పంచ్ కోటి తదితరులు పాల్గొన్నారు.

తమ ప్రభుత్వం వెంటే జనం

డుంబ్రిగుడ: నియోజకవర్గ ప్రజలంతా తమ ప్రభుత్వం వెంటే ఉన్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. సోమవారం మండలంలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల్లో అందరి సహకారంతో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు విజయవంతం అయ్యాయన్నారు.నియోజకవర్గంలో 78,650 ఇళ్లకు వెళ్లి స్టిక్కర్లు అంటించామన్నారు. ఇందుకు వారంతా స్వచ్ఛందంగా సహకరించారన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహణలో డుంబ్రిగుడ మండలం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. నియోజకవర్గంలో 90 శాతం కుటుంబాలను సందర్శించామన్నారు. 26,700 మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. ప్రజల ఇళ్లను నేరుగా సందర్శించి వారితో వ్యక్తిగతంగా మాట్లాడినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి అంటే ఏంటో చూడగలిగామన్నారు. ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చిన సీఎం జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలు తమ పిల్లల భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విశ్వసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, సర్పంచ్‌లు వెంకటరావు, నాగేశ్వరరావు,శారద, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, ఉప సర్పంచ్ జగ్గునాయుడు,మాజీ ఎంపీటీసీ మహాదేవ్,కామేష్ ,డీఎంయూ జిల్లా అధ్యక్షుడు సునిల్ తదితరులు పాల్గొన్నారు.

పాలనకు సంపూర్ణ మద్దతు

అడ్డతీగల: రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలనకు ప్రజల సంపూర్ణ మద్దతు లభించిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వబట్టే జగనన్నే మా భవిష్యత్, మెగా పీపుల్స్ సర్వే కార్యక్రమాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్రలో ప్రజల అవసరాలు, కష్టాలను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన చేపట్టారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి పూర్తి ప్రాధాన్యమిచ్చారన్నారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. తమ ప్రభుత్వంలో పొందిన లబ్ధిని ప్రతీ ఇంటికి వెళ్లి వివరించామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు తమ ప్రభుత్వానికి మిస్డ్ కాల్స్ ద్వారా మద్దతు తెలిపారన్నారు. ఈ ప్రజా స్పందనను చూసిన ప్రతిపక్ష టీడీపీ నేతలు బెంబేలెత్తిపోయారన్నారు. వాస్తవ విరుద్ధంగా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. అధికారం కోసం చంద్రబాబు సుపుత్రుడు లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసి వారికి అండగా ఉన్నామన్న భరోసాను ఇవ్వగలిగాం కాబట్టే జగనన్న పాలనను మళ్లీ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, వైస్ ఎంపీపీ కరణం వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేరుశనగ పంటపై అవగాహన



వేరుశనగ పంట అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

వై.రామవరం: పందిరిమామిడి కృషీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో యార్లగడ్డ సచివాలయం పరిధి పైడిపుట్ట గ్రామంలో సోమవారం క్షేత్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వేరుశనగలో చీడపీడల నివారణ, అధిక దిగుబడి సాధన తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పొలాల్లోకి వెళ్లి క్షేత్ర పరిశోధన చేశారు. వేరుశనగ రైతులకు సూక్ష్మ పోషకాలున్న ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషీ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ చిరంజీవి, ఏవో వి.ఉషారాణి, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో అవస్థలు

పెదబయలు: విద్యుత్ అంతరాయంతో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ నెల 23 సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు 14 గంటల పాటు ఈ సమస్య నెలకొంది. మండలంలోని చుట్టుమెట్ట సమీపంలో పాడేరు నుంచి పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు విద్యుత్ సరఫరా అయ్యే 33 కేవీలైన్ మరమ్మతులకు గురైంది. ఆదివారం రాత్రంతా అంతరాయం ఏర్పడింది. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మరలా ఇదే పరిస్థితి ఏర్పడింది. చిన్న పాటి వర్షం కురిసినా రెండు మండలాల వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంచాయతీల్లో 'ఉత్తమ' స్థానం

- రాష్ట్ర స్థాయిలో నాలుగు అవార్డులు
- ప్రత్యేకత చాటుకున్న ఉమ్మడి విశాఖ
- అల్లూరి జిల్లాకు ఐదు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తమ పంచాయతీల జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు విశిష్ట స్థానం దక్కింది. వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి అవార్డులను దక్కించుకుని ప్రత్యేకతను చాటుకుంది. పంచాయతీల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, చైల్డ్ ఫ్రెండ్లీ, సమృద్ధిగా నీరు, పచ్చదనం-పరిశుభ్రత, స్వయం సమృద్ధి, సాంఘిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వకం అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఆయా పంచాయతీల ప్రతిభ ఆధారంగా ఈ అవార్డుల ఎంపిక జరిగింది. ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో నాలుగు అవార్డులు దక్కాయి. అనకాపల్లి జిల్లాకు రెండు, విశాఖ, అల్లూరి జిల్లాకు ఒక్కొక్కటి చొప్పున సాధించాయి. నిర్దేశిత వంద మార్కులకు గాను 98-100 వరకు సాధించి ఈ అవార్డులను పొందాయి. అలాగే ఒక్కో కేటగిరీలో తొమ్మిది చొప్పున ఉమ్మడి విశాఖ జిల్లాలో 27 పంచాయతీలకు అవార్డులు అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఐదు, అనకాపల్లి జిల్లాకు 20, విశాఖ జిల్లాకు రెండు చొప్పున అవార్డులు దక్కాయి.

జిల్లా స్థాయి అవార్డుల ప్రదానం

పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో తొమ్మిది అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 27 పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌విశ్వనాథన్ వీటిని అందజేశారు. జిల్లా పరిషత్ ముఖ్యనిర్వహణాధికారి శ్రీరామ్మూర్తి, ఎంపీడీవోలకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ పంచాయతీరాజ్ ఉద్యోగులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

పాడేరు రూరల్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం వివిధ కేటగిరీల్లో పలు పంచాయతీలకు అవార్డులను జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ అందజేశారు. రాష్ట్ర స్థాయిలో హుకుంపేట మండలం భీమవరం పంచాయతీ ఉత్తమ ద్వితీయ పంచాయతీగా, జిల్లా స్థాయిలో పేదరిక నిర్మూలనలో జి.మాడుగుల మండలం కిల్లంకోట, పచ్చదనం పరిశుభ్రతలో జి.మాడుగుల, పాడేరు మండలం మినుములూరు, సుపరిపాలనలో జి.మాడుగుల మండలం గడుతూరు ఎంపికైనట్టు ఆయన వివరించారు.

గిరిజన హక్కులను హరిస్తే ఉద్యమిస్తాం

- సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ శ్రేణులు

పాడేరు రూరల్ : ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను హరిస్తే మరో ఉద్యమం తప్పదని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన పాడేరులో సీపీఎం, సీపీఐ పార్టీల ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పార్టీశ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ ఎదుట ప్రధాన రహదారిపై సీపీఎం మండల పార్టీ కార్యదర్శి ఎల్. సుందరరావు నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణాల కోసం ఆదివాసీ ప్రాంతాల్లో గ్రామ సభల తీర్మానం లేకుండా అటవీ భూములను బడా ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టడాన్ని విరమించాలన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం మత ఘర్షణలు సృష్టిస్తోందన్నారు. కేంద్రంలో బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం, సీపీఐ ఐక్య పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పాలికి లక్కు, సీపీఐ మండల కార్యదర్శి కూడా రాధాకృష్ణ, నాయకులు పోతురాజు, బిమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



రేలారే కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

కొయ్యూరు: శరభన్నపాలెం-నడింపాలెం గ్రామాల మధ్య వెలసిన ఎర్రగొండమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అరకు ఎంపీ మాధవి జన్మదినం సందర్భంగా ఆదివారం నుంచి ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ఎంపీ దంపతులు ప్రజల సమక్షంలో జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జబర్దస్త్ నటులు అప్పారావు, దొరబాబు, రాజమౌళి బృందంతో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పూయించింది. మరోవైపు రేలారే రేరేలా కార్యక్రమం ఉర్రూతలూగించింది. చింతపల్లి సహా ఇతర మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ కార్యక్రమాలు వీక్షించారు.

కేజీహెచ్‌లో పరికరాల కోసం హెచ్‌పీసీఎల్ రూ.2.66 కోట్ల వితరణ



ఒప్పంద పత్రాలతో కలెక్టర్ మల్లికార్జున, హెచ్‌పీసీఎల్ అధికారులు

మహారాణిపేట : కేజీహెచ్‌లోని పది విభాగాల్లో పరికరాల కొనుగోలు కోసం హెచ్‌పీసీఎల్ రూ. 2.66 కోట్లు కేటాయించింది. ఈ మేరకు సోమవారం హెచ్‌పీసీఎల్ అధికారులు జిల్లా కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో ఎంవోయూపై సంతకం చేశారు. కేజీహెచ్‌లో మెరుగైన సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించడంపై కలెక్టర్ అభినందనలు తెలిపారు. రోగుల సంరక్షణ, చికిత్స ప్రమాణాల పెంపునకు ఉపయోగపడే పరికరాలు అందించేందుకు హెచ్‌పీసీఎల్ ముందుకు రావడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్‌రాజ్, చీఫ్ జనరల్ మేనేజర్ కె.నగేష్ బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.గోపి పాల్గొన్నారు.

త్వరలోనే సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఈవో

- నిజరూపదర్శన భాగ్యంతో సామాన్య భక్తుల సంతృప్తి
- చందనోత్సవానికి సహకరించిన ప్రజలందరికీ ధన్యవాదాలు
- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్, పోలీస్ కమిషనర్



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ

సాక్షి, విశాఖపట్నం : త్వరలోనే సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఈవోని నియమిస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ 2.20 లక్షల మంది భక్తులు రావడం కారణంగా కొంతమేర అసౌకర్యం కలిగిందన్నారు. అయినా ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. తెల్లవారు జామున 4 నుంచి 6.30 గంటల మధ్యలో ఎలాంటి ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా దర్శనాలు జరిగాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడం వల్ల కాస్తా గందరగోళ పరిస్థితులు నెలకొన్నా.. కొద్ది గంటల్లోనే పోలీస్ సిబ్బంది.. పరిస్థితులను చక్కదిద్దారని వివరించారు. ఆలయం వెలుపల భక్తుల రద్దీ గమనించిన కలెక్టర్ డా.మల్లికార్జున ఆలయం లోపల ఉన్న భక్తులకు దర్శనం తొందరగా కల్పించి బయటకు పంపించే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారన్నారు. క్యూలైన్లలో భక్తులకు చల్లని మజ్జిగ, మంచినీరు, బిస్కట్లు పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. సాధ్యమైనంత ఎక్కువ మందికి దర్శనం కల్పించే ప్రయత్నం అధికారులు చేశారన్నారు. భక్తులు ఉచిత దర్శనం చేసుకునేందుకు ఐదు కిలోమీటర్ల మేర అప్‌హిల్ బస్టాండ్ లోవతోట మీదుగా 2.6 మీటర్ల వెడల్పాటి బారికేడ్లు, రూ.300 భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా 3.9 కిలోమీటర్ల నీలాద్రి గేటు నుంచి 2.6 మీటర్ల బారికేడ్లు, రూ.1000 భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా 2.4 కిలోమీటర్ల మేర మే ఐ హెల్ప్ యు నుంచి 2.6 మీటర్ల బారికేడ్లు, రూ.1500 వీఐపీలు, వీవీఐపీ భక్తులు దర్శనం చేసుకునేందుకు 0.3 కి.మీ మేర 2.6 మీటర్ల బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 82 శాశ్వత టాయిలెట్స్, 75 మొబైల్ టాయిలెట్స్, కొండ దిగువన మరో 55 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ అర్ధరాత్రి వరకూ ఉచిత అన్నప్రసాదం అందించామని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చందనోత్సవం సజావుగా జరిగేలా సహకరించిన భక్తులు, స్థానికులు, అధికారులు, సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ డా.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డా.త్రివిక్రమ్‌వర్మ, డీఆర్వో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి

చింతూరు: మండలంలోని బొడ్డుగూడెం వద్ద బొలేరో ఢీకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన కిచ్చా రాములమ్మ(50) అనే మహిళ మృతిచెందింది. ఆమె రహదారి దాటుతున్న క్రమంలో ఛత్తీస్‌గఢ్ వెళుతున్న బొలేరో వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో రాములమ్మకు తీవ్రగాయాలు కాగా సమీపంలోని ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందింది.

వలసపల్లిలో జ్వరాలు



సీలేరు: స్థానిక పీహెచ్‌సీ పరిధి వలసపల్లి గ్రామంలో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు మంచం పట్టారు. మూణ్నెల్లుగా గ్రామానికి వైద్య సిబ్బంది రాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. దేవేందర్ అనే బాలుడికి మలేరియా జ్వరం సోకడంతో వీరి ఇంటికి బంధువుగా వచ్చిన గిరిజనుడు ఎలాంటి వైద్యార్హత లేకపోయినా మూడు రోజులుగా ఇంజక్షన్లు వేస్తున్నాడు. కిముడు భీష్మ(10), కిముడు బలభద్రం(12), కిముడు బసంతి(7), మజ్జి అర్జున్(22) తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నారు. వైద్యాధికారులు స్పందించి జ్వరపీడితులకు వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

బడి బయట పిల్లలను చేర్పించండి

అరకులోయ: బడి బయట పిల్లలంతా పాఠశాలలోనే ఉండాలని జిల్లా జీసీడీవో సూర్యకుమారి తెలిపారు. మండలంలోని పద్మాపురం పంచాయతీ ఎండపల్లివలస కేజీబీవీలో బడి బయట బాలికలను గుర్తించి చేర్పించుటకు సోమవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీల్లో అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తుందని, పాఠశాల దశ మధ్యలోనే చదువు మానేసిన పిల్లలను గుర్తించి చేర్పించాలన్నారు. ఎంఈవో భారతి రత్న, ప్రిన్సిపాల్ స్వామి సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

హుకుంపేట: మండలంలోని తీగలవలస, తడిగిరి, మఠం పంచాయతీల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ గాలివాన సోమవారం కురిసింది. దీంతో మండలంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. తీగలవలస పంచాయతీ డి.గరుడాపల్లి గ్రామంలో భారీ గాలివానకు ఓ వృక్షం విద్యుత్ తీగలపై పడింది. దాంతో విద్యుత్ స్తంభం విరిగి పడింది. ఆ సమయంలో సరఫరా నిలిపి వేయడంతో ప్రమాదం తప్పింది.

డుంబ్రిగుడ: మండలంలోని డుంబ్రిగుడ, అరకు సంతబయలు, కించుండల తదితర గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మే 5న బల్క్ ల్యాండ్స్‌కు వేలం

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏకు చెందిన బల్క్ ల్యాండ్స్ విక్రయానికి మే 5వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 25వ తేదీ నుంచి మే 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గలవారు రాష్ట్ర ప్రభుత్వ ఈ-ఆక్షన్ పోర్టల్ https://konugolu.ap. gov.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరవాడ మండలం ఎదులపాక బోనంగి గ్రామంలో 4.5 ఎకరాలు, మధురవాడలో 0.64 ఎకరాలు, అదే ప్రాంతంలో 147/పీ సర్వే నెంబర్‌లో 0.832 ఎకరాలు, 1.755 ఎకరాలు, 0.193 ఎకరాలు, అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో 388/1పీ సర్వే నెంబర్‌లో 6 ఎకరాలు, అందులోనే మరో 3.96 ఎకరాలు విక్రయానికి వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పూర్తి వివరాల కోసం వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్ www.vmrda.gov.inలో గానీ, కొనుగోలు పోర్టల్‌లో హెల్ప్‌డెస్క్ 08645-246370/71/72/73/74కు సంప్రదించాలని సూచించారు.

పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం

- జూమ్ కాన్ఫరెన్స్‌లో అధికారులతో ఐటీడీఏ పీవో అభిషేక్



పాడేరు రూరల్: పర్యాటక ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ ఆదేశించారు. సోమవారం పాడేరు ఐటీడీఏ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనాలు చేశారు. పద్మాపురం ట్రీ హౌస్‌లు, హెచ్ఎస్‌టీసీ ఫారం, హౌస్ కాటేజీలు, చాపగెడ్డ గార్డెన్ పనులను వేగవంతం చేయాలన్నారు. మే 1వ తేదీ కల్లా సాధ్యమైనన్ని పనులు పూర్తి చేసి పర్యాటకులకు అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తేవాలని ఆదేశాలు జారీ చేశారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



బాండు అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం విజయవాడకు చెందిన మంచకొండ సాయి అశ్విత నరసమ్మ అనే దాత రూ.లక్ష విరాళం అందజేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కురకుల నాగేశ్వరరావు సంబంధిత విరాళాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూనవరం పీహెచ్‌సీకి బెడ్స్, పరుపుల వితరణ



ఆస్పత్రి సిబ్బందికి బెడ్స్ అందజేస్తున్న గాంధీబాబు

కూనవరం: ఇటీవల రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించిన స్థానిక పీహెచ్‌సీకి ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ(రేఖపల్లి) వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు సోమవారం నాలుగు బెడ్స్, నాలుగు పరుపులు, శానిటైజర్స్ వితరణగా అందజేశారు. ఈ ఆస్పత్రి ప్రారంభానికి ముందు రూ.20 వేలు విలువైన ఎలక్ట్రికల్ సామగ్రిని ఆయన సమకూర్చారు. చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూనవరం పీహెచ్‌సీ వైద్యులు రాజీవ్, సునీల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 50 లక్షలతో కేజీహెచ్ ఆధునిక సత్రం రెడీ

- నేడు ప్రారంభించనున్న మంత్రి విడదల రజని



కేజీహెచ్‌లో ఆధునిక సత్రం



కేజీహెచ్‌లో ఆధునిక సత్రంలో రోగుల సహాయకుల కోసం పడకలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులు విశ్రాంతి తీసుకునేందుకు 2013లో నాటి రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి నిధులతో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. అయితే కలెక్టర్ మల్లికార్జున స్పందించి ఆ భవనాన్ని ఆధునీకీకరించారు. సీఎస్ఆర్ నిధులు, ఇస్కాన్ నిధులతో ఈ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రూ.50లక్షలతో భవనాన్ని అందుబాటులో తీసుకొచ్చారు. దీనికి కేజీహెచ్ ఆధునిక సత్రం అని నామకరణం చేశారు. భవనాన్ని మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని ప్రారంభించనున్నారు. రెండు అంతస్తుల్లో కూడిన ఈ భవనంలో సదుపాయాలు కల్పించారు. నిర్వహణ బాధ్యతను సాగర్‌నగర్‌కు చెందిన ఇస్కాన్ సంస్థకు అప్పగించారు. ఈ భవనాన్ని ఆధునికరించి రోగుల సహాయకులు వినియోగించనున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ డి.ఏ.నాయుడు పర్యవేక్షణలో డీఈఈ మన్మథరావు ఆధ్వర్యంలో భవన ఆధునికీకరణ జరిగింది. విద్యుత్ పనులు, పరుపులు, దోమ తెరలు, మంచినీటి సదుపాయం కల్పించారు. ఇస్కాన్ రూ.20 లక్షలు సాయం చేయగా కలెక్టర్ మల్లికార్జున సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె పద్మ

మాడుగుల రూరల్: తండ్రి మృతితో కొడుకులు లేని ఆయనకు కుమార్తె దహన సంస్కారాలు చేసిన ఘటన మండలంలోని కేజేపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పి.బలరామమూర్తి (63) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు కుమారి, పద్మ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో సోమవారం ఉదయం చిన్నకుమార్తె పద్మ తండ్రి అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకు వచ్చింది. హిందూ సాంప్రదాయం ప్రకారం కార్యక్రమాలను పూర్తి చేసిన పద్మ తండ్రి చితికి నిప్పంటించింది.

ఆరోపణలపై విచారణ

మాకవరపాలెం: రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాన్ని తాకట్టు పెట్టినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నట్టు డీటీ శంకర్రావు తెలిపారు. మండలంలోని రాచపల్లి సచివాలయ పరిధిలో బియ్యం పంపిణీ చేసే వాహనాన్ని డ్రైవర్ తాకట్టు పెట్టినట్టు సోమవారం ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డీటీ మాట్లాడుతూ వచ్చిన ఆరోపణలు వాస్తవామా కాదా? అనే విషయమై విచారణ చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డిపాలేనికి చెందిన ఎస్.నూకరాజు (54) మేపుకు గొర్రెలను తోలుకు వెళ్తుండగా సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. నూకరాజును వెనుక నుండి ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నూకరాజును 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.